క్లుప్తంగా

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన


క్రీడాకారులతో ఎమ్మెల్యే వెంకట్రావ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని 4 ట్యూన్ ఫిట్‌నెస్ క్లబ్‌కు చెందిన క్రీడాకారులు ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, సిద్దు, మిథున్, వేణు, రాహుల్, పవన్, పండు పాల్గొన్నారు.

ఐటీసీ పీఎస్‌పీడీని విస్తరించాలి


శైలేంద్ర సింగ్‌ను సన్మానిస్తున్న శంకర్‌రెడ్డి

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీని మరింతగా విస్తరించి పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయాలని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేంద్ర సింగ్‌ను రోటరీ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి కోరారు. యూనిట్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టిన శైలేంద్రసింగ్‌ను శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనిట్‌హెడ్‌గా ఐటీసీ పీఎస్‌పీడీని మరింత ఉన్నతిలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

డిమాండ్లు పరిష్కరించాలి

గుండాల: రాష్ట్ర వ్యాప్తంగా 20 ఏళ్లుగా సర్వశిక్షలో విధులు నిర్వహిస్తున్న వివిధ రకాల సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సర్వశిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రమ దోపిడీకి గురవుతున్న వారికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోత్ భోజ్య, ఈసం ముత్తయ్య, కొమరం లాలయ్య, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, భిక్షమయ్య, కుమార్ రాజా, భద్రు, సంపత్, రామయ్య పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు తప్పవు

మణుగూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు తప్పవని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మణుగూరు–బీటీపీఎస్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైందని, భారీ వాహనాల రాకపోకలతో దుమ్ముధూళి విపరీతంగా ఎగిసి పడుతోందన్నారు. సమస్యను ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. రహదారి మరమ్మతులపై సంబంధిత అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

బోల్తాపడిన ట్రక్కును ఢీ కొట్టిన కారు

దమ్మపేట: రాష్ట్రీయ రహదారిపై బోల్తాపడిన ట్రాక్టర్ ట్రక్కును, కారు ఢీకొట్టిన ఘటన మండలంలోని మొద్దులగూడెం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మందలపల్లి నుండి సత్తుపల్లి వైపునకు జామాయిల్ కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మొద్దులగూడెం శివారుకు చేరుకోగానే లింకు ఊడిపోవడంతో ట్రక్కు ఒక్కసారిగా బోల్తా పడింది. అదే సమయంలో ట్రాక్టరు వెనుక వస్తున్న కారు, కిందపడిన ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతినగా ఎవరికీ ఏమీ కాలేదు.

'సీఎం కప్' పోటీల్లో ప్రతిభ

అశ్వారావుపేట: సీఎం కప్ పోటీల్లో అశ్వారావుపేట మైనారిటీ బాలికల గురుకులం విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ తూము సంగీత శుక్రవారం తెలిపారు. ఖోఖోకు నలుగురు, కబడ్డీకి నలుగురు, వాలీబాల్‌కు ఇద్దరు, అథ్లెటిక్స్‌కు ముగ్గురు కలిపి జిల్లా స్థాయి పోటీలకు 13మంది ఎంపికయినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను, ప్రిన్సిపాల్, పీఈటీలను ఎంపీడీఓ ప్రవీణ్, సెక్రటరీ శ్రీరామ్మూర్తి అభినందించారు.

ఊరు ఉండమంటోంది.. ఓసీ పొమ్మంటోంది..

- సమస్యలతో స్వాగతం పలుకుతున్న రాజుపేట
- దుమ్ముధూళితో గ్రామస్తుల సహవాసం
- పట్టించుకోని అధికారులు




ప్రమాదకరంగా ఉన్న మలుపు (ఇన్‌సెట్) రాజుపేట బోర్డు

మణుగూరు రూరల్: ఊరు ఉండమంటున్నా.. మణుగూరు ఓసీ పొమ్మంటోంది అన్నట్టు మారింది రాజుపేట గ్రామస్తుల పరిస్థితి. పేరుకు మున్సిపాలిటీ పరిధి గ్రామం... అభివృద్ధికి మాత్రం ఆమడ దూరం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా, ప్రభుత్వాలు మారినా రాజుపేట వాసుల బతుకులు మారడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామానికి వచ్చే వారికి సమస్యలు స్వాగతం పలుకుతూనే ఉంటాయి. గ్రామస్తులు ఉన్న సమస్యలే చాలురా దేవుడా అనుకుంటుండగా.. సింగరేణి వారి మణుగూరు ఓసీ మరింత పెద్ద సమస్యగా మారింది. సమయానికి తాగునీరు, కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతుంటే.. మణుగూరు ఓసీ నుండి వందలాది బొగ్గు లారీలు రాకపోకలతో, ఓసీ బ్లాస్టింగ్‌లతో దుమ్ముధూళి రాజుపేట వాసుల ఇళ్లను ముంచెత్తుతున్నాయి. ఏ ఇంటిని చూసినా దుమ్మే దర్శనమిస్తోంది.

ఇటు ఇసుక లారీలు కూడా...

ఓ పక్క బొగ్గు లారీలతో సతమవమతుండగా.. గోదావరి ఇసుక రేవు నుంచి ఇసుక లారీలు సైతం ఈ గ్రామం మీదుగా వెళ్తుంటాయి. దీంతో ధ్వని, వాయు కాలుష్యాలు పెరిగి ప్రజలు చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంటి, నీళ్ల పన్నులు వసూలు చేస్తున్నారే తప్ప తమ సమస్యలు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు తమ వెతలను విన్నవించుకున్న పరిష్కరించే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు కూడా తమ వైపు కన్నెత్తైనా చూడడం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ జీవనం..

ఇదిలా ఉంటే సరైన వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో అతివేగంగా బొగ్గు, ఇసుక లారీ రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ మార్గంలో బొగ్గు టిప్పర్లు, లారీల రాకపోకలతో గతంలో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. అనేక మార్లు గ్రామస్తులు నిరసనలు తెలపడంతో సింగరేణి యాజమాన్యం తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టినప్పటికీ శాశ్వత పరిష్కారం చూపించడంలో నిర్లక్ష్యంగా వహిస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టాలనిని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఎన్నో ఏళ్లుగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం లారీల రాకపోకలతో అవస్థలు పడుతున్నాం. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నాం. దీనికి తోడు దుమ్ముధూళి విపరీతంగా వచ్చి అనారోగ్యాల గురి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పటికైనా అధికారులు సమస్యలు పరిష్కరించాలి.

– వేణు, రాజుపేట

అధికారులు పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నా, ఎన్నిసార్లు విన్నవించినా మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నిధులు విడుదలయ్యాయని చెబుతున్నారే కానీ .. మా గ్రామానికి కనీస సౌకర్యాలు కూడా లేవు. ఇకనైనా అధికారులు దృష్టి సారించి మా సమస్యలు పరిష్కరించాలి.

– కానూరి నాగేష్, రాజుపేట

వీధి లైట్లు లేక అంధకారంలో...



చాలా కాలంగా వీధిలైట్లు వెలగడం లేదు. మున్సిపల్ అధికారులు లైట్లు మరమ్మతులు చేసిన పాపానపోలేదు. అంధకారంలో మగ్గుతున్నాం. రాత్రి అయితే చిన్న పిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బెంబేలెత్తుతున్నాం. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నాం

– తుంపిరి క్రాంతి కుమార్

లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్: ఈ నెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహిస్తుండగా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం భద్రాద్రి స్టేడియంలో చేపడుతున్న ఏర్పాట్లను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం డీ.శ్యాం సుందర్, ఏజీఎం(సివిల్) డీ.వెంకటేశ్వర్లు, ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) రమేష్, అధికారులు మధుసూదన్, శోభన్‌బాబు, సింగు శ్రీనివాస్, వి.రామేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ఐఎన్‌టీయూసీని గెలిపించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

బూర్గంపాడు: కార్మిక సంక్షేమానికి సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సారపాకలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచినప్పుడు యాజమాన్యంతో చేసుకున్న వేతన ఒప్పందాలే దీర్ఘకాలం కార్మికులకు మేలు చేశాయన్నారు. ఈసారి ఎన్నికలలో కార్మికులంతా ఐఎన్‌టీయూసీ వైపునే ఉన్నారని, మోసపూరిత హామీలను నమ్మి కార్మికులు తమ హక్కులను కాలరాసుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, ఎస్‌వీబీ.రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జక్కుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుమ్మలకు నాయకుల శుభాకాంక్షలు


మంత్రి తుమ్మలతో నాయకులు

చండ్రుగొండ : మంత్రిగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా గండుగులపల్లిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రెస్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏడుకొండలు, గాదె శివప్రసాద్, లక్ష్మణరావు, నల్లమోతు రవికుమార్, సాంబ, బడుగు కృష్ణవేణి ఉన్నారు.

అన్నపురెడ్డిపల్లి యూత్ ఆధ్వర్యంలో ..

అన్నపురెడ్డిపల్లి మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన వేముల సరేష్ మంత్రి తుమ్మలను కలిశారు. వనమా గాంధీ, వేముల నారాయణ, లాలయ్య, ఇనుగంటి ప్రసాద్, అహెమద్, రమేష్, భరత్‌కుమార్ ఉన్నారు.

ఆర్థికసాయం

భద్రాచలంటౌన్: కెన్సర్‌తో బాధపడుతున్న మహిళకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. పినపాక మండలం జానంపేటకు చెందిన దాట్ల ఉషారాణి కెన్సర్‌తో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాసరాజును సంప్రదించగా చైర్మన్ వెంకటరామరాజు నగదు అందజేశారు. సదరు నగదును క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణంరాజు బాధితురాలి కుమార్తె నీలిమకు అందజేశారు.

కొనసాగుతున్న సర్వే


తిమ్మంపేటలో సర్వే..

ములకలపల్లి: మండలవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే సాగుతోంది. తిమ్మంపేటలో జీపీ కార్యదర్శి రవి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన సర్వేను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పాలకుర్తి సుమిత్, సోయం నాగరాజు, కటికనేని ఆదిత్య, రాయల చంద్రం, మడకం కిరణ్, పుప్పాల సునీల్ పాల్గొన్నారు.

తాళ్లూరిని కలిసిన ఎమ్మెల్సీ


పంచాక్షరయ్యతో మాట్లాడుతున్న తాతా మధు

బూర్గంపాడు: తాళ్లూరి ట్రస్ట్ వ్యవస్థాపకులు తాళ్లూరి పంచాక్షరయ్యను ఇరవెండిలోని ఆయన నివాసంలో శుక్రవారం తాతా మధు కలసి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను తెలుసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, కామిరెడ్డి రామకొండారెడ్డి, జలగం జగదీష్, తాళ్లూరి శ్రీహరి తదితరులున్నారు.

అటకెక్కిన అభివృద్ధి ఫలాలు

మణుగూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అటకెక్కుతున్నాయని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని భద్రాచలం క్రాస్ రోడ్డు నుండి దుగినేపల్లి వరకు రోడ్డు అంతా గుంతలమయం కావడంతో, బీటీపీఎస్ రహదారి కూడా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణమే రహదారి మరమ్మతులు చేయించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కో కన్వీనర్ నూకారపు రమేష్, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, ఎడ్ల శ్రీనివాస్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ప్రభుదాస్, టి రామకోటి, బి.రమేష్, జి.సృజన్, నర్సింహరావు, హర్ష, శ్రీను, చందర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హనుమత్ వ్రతాలు


భద్రాచలంటౌన్: వ్రత పూజలు చేస్తున్న భక్తులు


చర్లలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంలో శుక్రవారం సామూహిక హనుమాత్ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజ కార్యక్రమాలు, అభిషేకం నిర్వహించిన వెండి కవచాలతో అలంకరించారు. అనంతరం సామూహిక హనుమాత్ వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమాన్ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల రాజగోపాలచార్యులు, భీష్మాచారి, రాఘవ శర్మ తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులపై మంత్రి ఆగ్రహం


అశ్వారావుపేట: అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల


అశ్వారావుపేటరూరల్: మట్టి దిబ్బలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్, సిబ్బందిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వారావుపేటలో నిర్మిస్తున్న డ్రెయినేజీ నాణ్యతా లోపాలతో ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారని, అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు వంకరగా డ్రెయినేజీ నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెయిన్‌రోడ్‌పై మట్టి కుప్పలు ఉండిపోవడంతో దుమ్ము రేగుతుందని, వాటరింగ్ చేయాలని పంచాయతీ సెక్రటరీ శ్రీ రామ్మూర్తిని ఆదేశించారు. పాత ప్రభుత్వాస్పత్రి, పాత ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణాలకు ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని ఆదేశించారు. డ్రెయినేజీ నిర్మాణం పక్కాగా నిర్మించి ఎవరికీ అసౌకర్యం కలిగించొద్దన్నారు.

మట్టి తొలగింపు..

అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారి ఉన్న భారీ గుంతలను ఎట్టకేలకు శుక్రవారం నుంచి రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో పూడ్చే పనులు మొదలు పెట్టారు. రహదారిపై గుంతలు పడటంతో వాహనదారుల పడుతున్న అవస్థలను ఈనెల 8న 'సాక్షి'లో 'గుంతలతో రోడ్డు ప్రమాదాలు' శీర్షికన కథనం ప్రచురించగా అధికారులు స్పందించి పేరాయిగూడెం డివైడర్ వద్ద నుంచి జాతీయ రహదారి ఉన్న గుంతలను వెట్‌మిక్స్‌తో పూడ్చివేస్తున్నారు. మరోవైపు రహదారిపై దుమ్మధూళి, చెత్తచెదారం ఉండటాన్ని మంత్రి తుమ్మల గమనించి పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తిను ప్రశ్నించి, తక్షణమే శుభ్రం చేయించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు జాతీయ రహదారిపై చెత్తాచెదారాన్ని, పేరుకుపోయిన మట్టి దిబ్బలను తొలగించే పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు.

మట్టి రోడ్డు లేకుండా కృషి చేస్తా..

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని, ప్రతీ గ్రామంలో మట్టిరోడ్డు లేకుండా సీసీ రోడ్లు వేయించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మండల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. చిక్కుడుగుంట గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి డీసీఎంఎస్ వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకుని బోనస్ పొందాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని రాయిగూడెంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి, లంక మల్లారం పంచాయతీలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ముత్యాలమ్మనగర్ పంచాయతీ కార్యాలయ భవనంలో అన్ని విభాగాల శాఖ ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను, సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామానికి చెందిన దివ్యాంగులకు రూ.50వేల చొప్పున ఐదుగురు లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ తెళ్లూరి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు

- ఎమ్మెల్యే ఆదినారాయణ


యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట: ఎంపిక చేయబడిన ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన నిర్వహించేలా ప్రణాళిక సిద్ధమవుతుందని, అంగన్‌వాడీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, అదనపు గదుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. స్థానిక గెస్ట్‌హౌస్ ఏరియాలోని సీయూపీఎస్ అనుబంధంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం యూనిఫాం పంపిణీ చేసి, సామూహిక సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన కార్మికులు తమ వేతనాలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రంపైకి పురాతన వేప చెట్టు ఒరిగిందని, ఏ క్షణమైనా చెట్టు కూలి భవనంపై పడే అవకాశముందని కార్యకర్త ఉషారాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ల స్పందించి తొలగించేందుకు అధికారులకు ఆదేశిస్తామన్నారు. ఎంపీడీఓ ప్రవీణ్, నాయకులు జూపల్లి రమేష్‌బాబు, తుమ్మ రాంబాబు, చిన్నంశెట్టి సత్యనారాయణ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల వినతి..

దమ్మపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, నియోజకవర్గ పరిధిలోని డ్వాక్రా మహిళ ఉద్యోగులు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను వెలుగు సీసీలు, వీఓఏలు తదితర ఉద్యోగులు కలిసి సమస్యలు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

క్షయ నిర్మూలనకు నడుం బిగించాలి

చర్ల: క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు అంతా నడుం బిగించాలని వైద్యాధికారి డాక్టర్ పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. క్షయవ్యాధిని నిర్మూలించేందుకు నిర్వహిస్తున్న వంద రోజుల అవగాహన కార్యాక్రమాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని లచ్చిగూడెం, నారాయణరావుపేట గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రం, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుల్లో ఆయన మాట్లాడారు. క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, దానిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సాగర్, పీపీఎం కో ఆర్డినేటర్ సోమయ్య, టీబీ అలర్ట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఎస్‌టీఎస్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, ఏఎన్ఎం సరోజిని, హెల్త్ అసిస్టెంట్, నర్సింహారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు వితరణ

ములకలపల్లి : మండలపరిధిలోని తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాల్వంచ వర్తక సంఘం అధ్యక్షుడు చలువది ప్రకాశ్ వితరణగా అందించిన పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను హెచ్ఎం శంకర్ శుక్రవారం అందజేశారు. ఉపాధ్యాయులు నిర్మల, సురేష్, ప్రశాంత్, ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలుశిక్ష, జరిమానా

భద్రాచలంటౌన్: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా పలువురికి న్యాయమూర్తి శివనాయక్ శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. వీరిలో 21 మందికి జరిమానా విధించగా, ఇంకో ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఏడు రోజులు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

రెండు విద్యుత్ మోటార్లు చోరీ

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామ శివారు పెద్దవాగుకు రైతులు అమర్చుకున్న రెండు విద్యుత్ మోటార్లు గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. తిప్పనపల్లి గ్రామానికి చెందిన ఎల్లబోయిన మల్లయ్య, కందిమళ్ల శ్రీను, గాదె ఉపేంద్రకు చెందిన రెండు విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. వాటి విలువ రూ.50 వేల వరకు ఉంటుంది. శుక్రవారం ఉదయం రైతులు మోటార్లు వేసేందుకు వెళ్లగా చోరీ విషయం వెలుగుచూసింది. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీస్ క్యాబిన్ స్టాండ్‌లు ఏర్పాటు


పోలీస్ స్టేషన్ సెంటర్లో పెట్టిన క్యాబిన్ స్టాండ్

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రధాన కూడళ్లలో పోలీస్ క్యాబిన్ స్టాండ్‌లను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్సై టి.యయాతి రాజు ఆధ్వర్యంలో నాలుగు క్యాబిన్ స్టాండ్‌లను తయారీ చేయించగా, వీటిని పోలీస్ సెంటర్‌లోని ప్రధాన కూడలిలో పెట్టారు. అలాగే వాహనాల రద్దీ, వీఐపీల రాకపోకల సమయంలో ఆయా స్టాండ్‌లలో పోలీస్ సిబ్బంది ఇబ్బందులు పడకుండా విధులు నిర్వహించేందుకు వీటిని ఏర్పాటు చేసినట్టు ఎస్సై తెలిపారు.